క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ గ్రామానికి చెందిన గుండా రామాంజనేయులు ఈనెల 3న తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ఫోన్‌ను గుర్తించారు. గురువారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. పోలీస్ సిబ్బంది అనిల్, లక్ష్మీనారాయణను ఎస్సై అభినందించారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై పేర్కొన్నారు.

'గృహజ్యోతి' వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గృహజ్యోతి పథకం అమలు ప్రక్రియను మండల సెస్ ఏఈ స్రవంతి గురువారం పరిశీలించారు. మండలంలో పర్యటించి ఇంటి యజమానులతో మాట్లాడారు. రేషన్ కార్డున్న ఉంటే 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి పథకం అమలవుతుందన్నారు. ఈనెల 15లోగా ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు మీటర్ లేకుండానే విద్యుత్ వినియోగిస్తున్నారని, అలాంటివారు సర్వీస్ నంబర్ పొందితేనే వారి వివరాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించాలి

చందుర్తి: చందుర్తి, రుద్రంగి మండలాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు మంజూరైన 109 కంప్యూటర్లను ఆయా పాఠశాలల్లో ఇన్‌స్టాలేషన్‌కు ఏజెన్సీల నుంచి ఓపెన్ టెండర్లను ఈనెల 10నుంచి 13వరకు అర్హత గల ఏజెన్సీల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 13న సాయంత్రం 5 గంటల్లోపు చందుర్తి ఎమ్మార్సీ కార్యాలయంలో అందజేయాలని ఎంఈవో కోరారు.

పుస్తకావిష్కరణ



వేములవాడఅర్బన్: ప్రముఖ కవి వీరగోని చైతన్య గౌడ్ రచించిన చైతన్య స్రవంతి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. చైతన్య స్రవంతి వచన సాహిత్యంలో చక్కని స్థానం దక్కించుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల మల్లారెడ్డి, డాక్టర్ ప్రసన్న, హరికృష్ణ, సంకెపల్లి నాగేంద్ర శర్మ, వీరగోని ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్



మాట్లాడుతున్న వికాస్‌రావు

కోనరావుపేట: మండలంలోని నాగారంలో గురువారం 'గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు మాట్లాడారు. మన దేశ ఖ్యాతిని ప్రపంచస్థాయిలో నిలబెట్టిన ఘనత మోదీదే అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాడి సురేందర్ రావు, గొట్టె రామచంద్రం, తిరుపతి గౌడ్, తీగల రవీందర్, మోహన్, ప్రదీప్, గంగయ్య, రాములు కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



గోరెమియా

బోయినపల్లి: బోయినపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ గోరెమియా (73) అదృశ్యమైనట్లు అతని కుమారుడు తాజ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరెమియా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల బోయినపల్లికి వచ్చి వెళ్లాడని, అయితే మళ్లీ తిరిగి రాలేదని తాజ్ తెలిపాడు. ఆచూకీ తెలిసిన వారు 9676638954, 9652790034 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తాజ్ పేర్కొన్నాడు.

ఏళ్లుగా సాగుతూనే..



ముస్తాబాద్ - పోతుగల్ మధ్య సగంలో నిలిచిన పనులు



రహదారిపై తొలగించని విద్యుత్ స్తంభాలు

- ముస్తాబాద్ నుంచి రాళ్లపేట వరకు రూ.32.50కోట్లతో రోడ్డు విస్తరణ పనులు
- శాఖల మధ్య సమన్వయ లోపం
- ఐదేళ్లుగా కొనసాగుతున్న పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ముస్తాబాద్: రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి తంగళ్లపల్లి మండలం రాళ్లపేట వరకు 2018లో రూ.32.50 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. శాఖల మధ్య సమన్వయలోపంతో పనులు చివరిదశలోనే ఉన్నాయి. ఐదేళ్లు దాటినా పూర్తికాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు

ముస్తాబాద్ నుంచి పోతుగల్ వరకు వేసిన బీటీ పనులు పూర్తయ్యాయి. విద్యుత్‌శాఖ, రోడ్డు భవనాల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్ స్తంభాలు రోడ్డుపైనే ఉన్నాయి. స్తంభాల చుట్టూ తారురోడ్డు వేయగా వాటిని తొలగించలేదు. పోతుగల్ నుంచి గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండా లోనూ పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ముస్తాబాద్ నుంచి పోతుగల్ వరకు ఒకే లైన్‌తో ఉన్న రహదారిని నాలుగు లైన్లకు విస్తరించారు. ముఖ్యంగా ముస్తాబాద్ మానేరు కెనాల్ నుంచి పోతుగల్ పీహెచ్‌సీ వరకు నాలుగులైన్ల విస్తరణ పనులు పూర్తిచేశారు. మధ్యలో డివైడర్ నిర్మించారు. కానీ పూర్తిస్థాయి గోడలను నిర్మించలేదు. నాలుగు లైన్ల రహదారిలో వాహనాల వేగంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. రాత్రివేళల్లో ఇప్పటికే స్తంభాలు ఢీకొని పలువురు గాయాలపాలయ్యారు. మానేరు కెనాల్ డి–18 నుంచి ఐకేపీ కార్యాలయం వరకు ఉన్న కెనాల్ రహదారిని ఆనుకొని ఉంది. ఇక్కడ కెనాల్‌లోకి ఎవరు వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

ముస్తాబాద్, పోతుగల్ మధ్య ఉన్న మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై వంతెనను విస్తరించలేదు. నాలుగు లైన్లతో వేగంగా వచ్చే వాహనాలు ఇక్కడి వరకు రాగానే పూర్తి నెమ్మదిగా రావాలి. లేదంటే కెనాల్‌లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. అలాగే కెనాల్ వద్ద పోతుగల్ వైపు నాలుగు లైన్లు తారువేయగా కెనాల్ మొదలు వద్ద కనీసం మట్టి కూడా పోయలేదు. ఇక్కడ వాహనాలు అదుపుతప్పి ప్రమాదం ఉంది. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ చూపి పనులు పూర్తి చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు. నీటిపారుదలశాఖ అధికారులు ఇక్కడ హెడ్ రెగ్యులెటరీ ఉన్న దృష్ట్యా వంతెన రెగ్యులేటరీ రెండు కలిపి నిర్మించాలని కోరుతుండగా ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెన మాత్రమే నిర్మిస్తామనడంతో పనులు నిలిచిపోయాయి.

నిత్యం వాహనాల రద్దీ

ముస్తాబాద్ నుంచి పోతుగల్ మీదుగా సిరిసిల్ల వరకు ఒకదారి, పోతుగల్ నుంచి సేవాలాల్‌తండా మీదుగా సిరిసిల్లకు వెళ్లే రహదారులు ఉండటంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. కొత్తగా ఈ రోడ్డు గుండా ప్రయాణించే వారు ప్రమాదాలబాన పడుతున్నారు. పూర్తిస్థాయిలో పనులు త్వరగా చేపట్టాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

పనులు పరిశీలిస్తాం



మానేరు కెనాల్‌పై వంతెన నిర్మాణంలో అభ్యంతరాలున్నాయి. రూపొందించిన అంచనాల్లో రెగ్యులేటరీ లేదు. విద్యుత్‌శాఖ అధికారులకు గతంలో స్తంభాలు తొలగించాలని తెలిపాం. అధికారుల సమన్వయంతో పనులు చేస్తాం – నరేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

సమన్వయంతో పూర్తిచేయాలి



ముస్తాబాద్, సిరిసిల్ల రోడ్డు విస్తరణ పనులు ఐదేళ్లుగా జరగడం విడ్డూరం. ఆర్‌అండ్‌బీ, సెస్, ఇరిగేషన్ అధికారులు పనులు పరిశీలించి పూర్తి చేయాలి. పనులు త్వరగా పూర్తి చేస్తే వాహనదారులకు కష్టాలు తొలగుతాయి.
– యెల్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

రైతులకు ఇబ్బంది



కెనాల్ వద్ద వంతెన ఇరుకుగా ఉంది. పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రూట్‌లో పాఠశాలలకు వెళ్లేవారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వంతెన పెద్దగా నిర్మించాలి. విద్యుత్ స్తంభాలను తొలగించాలి.
– కుంభాల రాజిరెడ్డి, రైతు, ముస్తాబాద్

సమ్మెను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి: కేంద్రప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నీలోజిపల్లిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల, రైతుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో నీలోజిపల్లి హమాలీ సంఘం నాయకులు శంకర్, కడుదుల రవి, కడుదుల అంజయ్య, అనుముల రవి, ఆవుల రాములు, సింగిరెడ్డి శంకర్, ఎర్రకిషన్, అనుముల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ ఆవరణలో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. మండలస్థాయి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాటలు, కవితలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. నోడల్ అధికారి గంగారాం, హెచ్‌ఎం శ్రీనివాస్, పద్మా, లక్ష్మణ్, రమ, రాజేశ్, మనోహర్, దేవరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం



సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బాలరాజుపల్లి, వెంకటాంపల్లి గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు ఏశ తిరుపతి, కట్కం చంద్రయ్యను, విద్యా కమిటీ చైర్మన్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు బాలచందర్, రవికుమార్, బాబు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుబ్బ రాజన్న జాతర

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి గ్రామంలో దుబ్బరాజన్న జాతర శుక్రవారం జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వారు పేర్కొన్నారు.

పోషక విలువల బాలామృతం

- ఏడునెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు అందజేత
- ఎత్తు, బరువులతో ఆరోగ్య లక్షణాల గుర్తింపు
- మాతా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన



బాలామృతం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చందుర్తి: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. అందులో భాగంగానే చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు మాతా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం ప్లస్ ప్యాకెట్లు అందిస్తోంది. వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఏడునెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 6,837, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వారు 5,901 మంది ఉన్నారు. 1254 మంది గర్భిణులు, 1055 మంది బాలింతలు ఉన్నారు. ప్రాజెక్టు పరిధిలో బలహీనంగా ఉన్న 108 మంది చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం బాలామృతం ప్లస్‌ను అందజేస్తున్నారు.

ఎత్తు, బరువు ఆధారంగా నమోదు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలున్న బాలామృతాన్ని చిన్నారులకు అందిస్తున్నారు. బాలామృతం ప్లస్‌లో పాలపొడి, వేరుశెనగ నూనె, రైస్, గోధుమలు, కంది పప్పు, పంచదారతో పాటు కొవ్వు పదార్థాలు కలిగిన మిశ్రమంజతచేస్తారు. ఎదుగుదల లోపించిన చిన్నారులకు ఈ ఆహారం అందించి మూడునెలల పాటు చిన్నారుల ఎదుగుదల, పోషకలోపాల తీరును పరిశీలిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా బరువు, ఎత్తు ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని రికార్డుల్లో నమోదు చేస్తారు.

చిన్నారులకు ఆరోగ్య కార్డులు

చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకునేందుకు ఆరోగ్యకార్డులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం, మధ్యాహ్నం భోజనం, చిరుతిండ్లు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన ప్రతి చిన్నారికి ప్రత్యేకమైన ఆరోగ్య పర్యవేక్షణ కార్డులు అందించి, వారి ఎత్తు , బరువు కొలతలు తీసుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు.

రోజూ అందిస్తున్నా



కూతురికి ఎదుగుదల లోపించిందని అంగన్‌వాడీ టీచర్ ఎత్తు బరువును పరిశీలించారు. పోషకాహార లోపంతోనే ఎదుగుదల లేదని భావించిన ఉపాధ్యాయురాలు మూడు నెలలుగా బాలామృతం ప్లస్‌ను అందజేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఎత్తు, బరువు చూసి ఎదుగుదల ఉందని చెప్పారు.
– బొంగు శ్రీలత, చందుర్తి

ఎన్నో పోషకాలు



చిన్నారుల ఎదుగుదల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం అందిస్తోంది. ఇందులో ఎన్నో పోషకాలుంటాయి. ఏడునెలల చిన్నారి నుంచి మూడేళ్ల లోపు వయస్సు ఉన్నవారికి అందిస్తున్నాం. చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించి ప్రతినెలా బరువును, ఎత్తు కొలత తీసుకుంటున్నాం.
– బుర్ర రేణుక, అంగన్‌వాడీ టీచర్,చందుర్తి

చిన్నారుల ఎదుగుదలకే



పోషకాహార లోపంతో బలహీనంగా ఉన్నవారికి బలవర్ధకమైన ఆహారంగా బాలామృతం ప్లస్‌ను ప్రభుత్వం అందిస్తోంది. పోషకాహారంతో లోపంతో ఉన్న చిన్నారులను గుర్తిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి.
– ఎల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీవో, వేములవాడ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వేములవాడ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై దిలీప్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం చైతన్య స్కూల్ సహకారంతో రాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు.

కమనీయం.. లక్ష్మీనారసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో స్వయం భూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మాఘ అమావాస్య ఉత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. స్వామివారికి ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నరసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మూడ్రోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం ఎడ్లబండ్ల గిరి ప్రదర్శన ఉంటుందని తెలిపారు. జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

గంభీరావుపేట: అసెంబ్లీ సమావేశాల్లో విద్యా రంగానికి ముప్పై శాతం నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా రంగానికి నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకులాలు, కేజీబీవీ హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని మెస్, కాస్మోటిక్స్ చార్జీలు రావడం లేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు.

'బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలి'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని రాచర్లగొల్లపల్లిలో గురువారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సాహెబ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి మాట్లాడారు. బాల్కసుమన్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి దిష్టిబొమ్మను ఊరేగించారు. నాయకులు నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, సుధాకర్ గౌడ్, నాగిరెడ్డి, భగవంత రెడ్డి, రమేశ్, ప్రసాద్, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాఘ అమావాస్య జాతరకు ఆలయం ముస్తాబు



హనుమాన్ మూలవిరాట్

గంభీరావుపేట: మాఘ అమావాస్య జాతర ఉత్సవాలకు మండలంలోని భీముని మల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉత్సవాలకు తరలివస్తారు. ఇందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. మానేరు నది తీరంలోని అంజన్న ఆలయంతో పాటు పలు ఆలయాల్లో అందంగా ముస్తాబు చేశారు. జిల్లాతోపాటు కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా ఈ జాతరకు తరలివస్తారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న మృతుడి కుటుంబానికి బాల్య మిత్ర ఫౌండేషన్ చేయూత అందించింది. మండలంలోని ఆవునూర్‌కు చెందిన బత్తుల రాజు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబానికి జెడ్పీ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బాల్యమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలు అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, రావుల ఎల్లారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సొల్ల క్రాంతి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

11నుంచి క్రికెట్ పోటీలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఈనెల 11నుంచి చీటీ వాసుదేవరావు స్మారక క్రికెట్ పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, పోలీసులు, అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేల నగదు, రెండో బహుమతిగా రూ.3వేల నగదుతో షీల్డ్‌లు అందజేస్తారన్నారు.

జయ జయహే తెలంగాణ గీతంపై హర్షం

ఎల్లారెడ్డిపేట: డాక్టర్ అందె శ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతంగా ప్రకటించడంపై తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వాసరవేని పర్శరాములు హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అందె శ్రీ రాసిన గీతం అందరినీ కదిలించిందన్నారు. ప్రతి విద్యాసంస్థలో మార్మోగిన ఈ గీతం ప్రజలను చైతన్యవంతులను చేసిందన్నారు. రాష్ట్రం సాధించుకున్నాక అందె శ్రీ రాసిన గీతాన్ని అధికారికంగా ఆమోదించడం అభినందనీయమన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ముస్తాబాద్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ గణేశ్ అన్నారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పలువార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పోతుగల్, ఆవునూర్, గూడెం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు.